క్లుప్తంగా

మహిళా మోర్చా జిల్లా కమిటీ ఎన్నిక

హన్మకొండ : బీజేపీ మహిళా మోర్చా పూర్తిస్థాయి జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రత్న లక్ష్మి శుక్రవారం వెల్లడించారు. మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా సిరికొండ కవిత, నూకల ఉషారెడ్డి, సింగిరెడ్డి రమ, మేకల కోమల, తడ కమల్ల వాణి, ప్రధానకార్యదర్శులుగా మునిగాల పద్మ, రజినీ, కార్యదర్శులుగా పి.అనిత, కనకలక్ష్మి, సిరికొండ సుజాత, పి.స్వప్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విశ్వనాథ్ శ్రీదేవిని నియమించినట్లు పేర్కొన్నారు. పరకాల టౌన్ అధ్యక్షురాలిగా వారాల శారద, ఆత్మకూరు మండల అధ్యక్షురాలిగా శ్రీలత, దామెర మండల అధ్యక్షురాలిగా డి.పద్మ, భీమదేవరపల్లి మండల అధ్యక్షురాలిగా కవిత, ఎలకతుర్తి మండల అధ్యక్షురాలిగా స్వాతిరెడ్డిని నియమించినట్లు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ అధ్యక్షులను కూడా నియమించినట్లు వెల్లడించారు. 40వ డివిజన్ అధ్యక్షురాలిగా పాక ఉష, గంగాదేవి (5వ డివిజన్), రామారపు మంజుల (6), రజిత (7), ఎస్.కవిత (9), నాసం కరుణ (10), నదియా (11), పిట్టల ధనలక్ష్మి (31), నాయిని శైలజ (45), రాణి (47), వాణి (51), జిల్లపల్లి కవిత (52), పాకాల పద్మ (57), సుజాత (65), మమత 66వ డివిజన్ అధ్యక్షురాలిగా నియమించినట్లు ప్రకటించారు.

నియామకం

పరకాల : కూరగాయాల మార్కెట్, వ్యాపారస్తుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా కుక్కల విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన నియామకానికి కృషి చేసిన వ్యాపారస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కారులో మంటలు



నల్లబెల్లి : ఎండలకు షార్ట్‌సర్క్యూట్‌తో కారులో మంటలు చెలరేగిన ఘటన తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ గ్రామానికి చెందిన నాగులగాని దిలీప్ భూమి రిజిస్ట్రేషన్ కోసం నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. ఈక్రమంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కారులోని వైర్లు షార్ట్‌సర్క్యూట్‌కు గురై మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు కారుపై నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు.

రేవూరి వెంట నడిచే వారికే ప్రాధాన్యం



గీసుకొండ : కాంగ్రెస్ బలోపేతం దిశగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెంట నడిచే వారికే పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కోనాయమాకుల వద్ద ఎంపీపీ బీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, గ్రామ కమిటీల నాయకులతో శుక్రవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో కొమురారెడ్డి మాట్లాడారు. రేవూరి నాయకత్వంలో పని చేయడానికి ఆయన సమక్షంలో పార్టీలో చేరే వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు. పరకాల నియోజకవర్గంతోపాటు గీసుకొండ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే రేవూరి నాయకత్వంలో పని చేయాలని సూచించారు. ఎంపీగా పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కూసం రమేశ్, దూల వెంకటేశ్వర్లు, ఆకుల రుద్రప్రసాద్, పత్తిపాక రవీందర్, వజ్ర రాజు, మండల కోఆప్షన్ సభ్యులు రహీం, దొడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఆదర్శంగా నిలవాలి



వర్ధన్నపేట : విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆ శాఖ డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) ఆనందం కోరారు. పట్టణంలోని పుస్కోస్ స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫీల్డ్ స్టాఫ్‌కు ఆయన శిక్షణ ఇచ్చారు. సిబ్బంది 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లను నిరంతరం పెట్రోలింగ్ చేయాలని చెప్పారు. పవర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ప్రతీనెల 33/11 కేవీ సబ్ స్టేషన్లలో సమస్యలు నివారించాలని తెలిపారు. వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించాలన్నారు. వరంగల్ డీఈ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలకు గ్రహణం

- కానరాని సదుపాయాలు
- ఆటస్థలాల్లో పిచ్చిమొక్కలు
- చోద్యం చూస్తున్న అధికారులు



క్రీడాకారులు లేక వెలవెలబోతున్న క్రీడామైదానం



మైదానంలో క్రీడలు ఆడుతున్న (ఫైల్)



కంఠాత్మకూరులోని క్రీడా మైదానం

నడికూడ : గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలకు గ్రహణం పట్టుకుంది. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండుకుని వెక్కిరిస్తున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్ తదితర క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో ఎకరం స్థలంలో లక్షల రూపాయలు వెచ్చించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ క్రీడా మైదానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కానీ వాటి నిర్వహణలో ఏమాత్రం దృష్టి సారించకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

సదుపాయాలేవీ..?

మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడామైదానాల్లో సదుపయాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గడ్డి, పిచ్చి మొక్కలతో క్రీడా మైదానాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు క్రీడా సామగ్రి, ఇతర సదుపాయాలను కల్పించకపోవడంతో క్రీడాకారులకు మైదానాలకు దూరంగా ఉంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల సమయంలో క్రీడలు ఆడేందుకు వీలు ఉండకపోవడంతో పాటు పాఠశాల సమయం పూర్తి అయ్యాక గేటుకు తాళం వేస్తుండడంతో క్రీడామైదానం విద్యార్థులకు, క్రీడాకారులకు నిరుపయోగంగా మారుతున్నాయి. మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టుకు సంబంధించిన ఐరన్ పోల్స్‌ను కూడా తొలగించడంతో పలువురు యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు దృష్టి సారించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

గ్రామీణ క్రీడాకారులకు మేలు



క్రీడా మైదానాల్లో సరైన సదుపాయాలు కల్పిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేయొచ్చు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల నామమాత్రపు పనితనంతో ప్రజాధనం వృథా అయ్యింది. అధికారులు స్పందించి క్రీడా మైదానాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి.

- కామెద్రి ప్రభాకర్, రిటైర్డ్ పీటీ

100 రోజుల పాలనలో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి



కండువా కప్పి ఆహ్వానిస్తున్న రావు పద్మ, రమేశ్



దామెర : మాట్లాడుతున్న కాళీప్రసాదరావు

ఐనవోలు : 100 రోజుల పాలనలో కాంగ్రెస్ పార్టీ విఫలం అయ్యిందని బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ విమర్శించారు. మండల కేంద్రంలోని బీజేపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నందనం, ఒంటిమామిడిపల్లి, కక్కిరాలపల్లి, ఐనవోలు, పెరుమాండ్లగూడెం, నర్సింహులగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన సుమారు 400 మంది నాయకులు బీజేపీలో చేరారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు రావు పద్మతో కలిసి ఆయన నాయకులకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తెలంగాణ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మోదీతోనే సాధ్యమని అన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. మాజీ సర్పంచ్‌లు కట్కూరి సునీత, పిడుగు రజితతోపాటు వివిధ పార్టీల, కుల సంఘాల నాయకులు చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, అసెంబ్లీ కన్వీనర్ కేశవరెడ్డి, గాడిపల్లి రాజేశ్వర్‌రావు, వనంరెడ్డి, జైపాల్, కుమార్, సుభాష్, మహేష్ పాల్గొన్నారు.

అరూరిని గెలిపించాలి

దామెర : రానున్న పార్లమెంట్ ఎనికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ నాయకుడు పగడాల కాళీప్రసాదరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రం ఇన్‌చార్జ్‌లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నరేంద్రమోదీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. మండలంలోని సీతారాంపూర్, పులుకుర్తి గ్రామాల నుంచి పలువురు బీజేపీలో చేరగా కాళీప్రసాద్‌రావు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మంద కృష్ణమాదిగపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న గంగారపు శ్రీనివాస్

ధర్మసాగర్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణపై కొందరు విమర్శలు చేయడం సరికాదని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు గంగారపు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణ మాదిగాపై కొందరు అనుచిత వాఖ్యలు చేస్తున్నారని, ఆయనను విమర్శించే స్థాయి ఎవరికీ లేదని మండిపడ్డారు. కొట్టే పద్మయ్య ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ ఏవృత్తిలో నిలకడగా కొనసాగలేదని విమర్శించారు. తన స్వలాభం కోసం అనేక పార్టీలు మారాడని ఆరోపించారు. గతంలో వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పింది బీజేపీ నాయకులని, కానీ ప్రధాని నరేంద్రమోదీ చెప్పలేదని అన్నారు. ఇటీవల హైదరాబాద్ పరేడు గ్రౌండ్‌లో జరిగిన విశ్వరూప మహాసభలో దేశ ప్రధాని ఎమ్మార్పీఎస్ సమావేశానికి వచ్చి వర్గీకరణ చేస్తామని చెప్పినందుకు మంద కృష్ణమాదిగ బీజేపీకి సంపూర్ణ మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. కడియం శ్రీహరి వేసే ఎంగిలి మెతుకులకు ఆశపడి బానిసగా మారి మందకృష్ణపై అనుచిత వాఖ్యలు చేస్తున్న కొట్టే పద్మయ్యకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బొడ్డు శాంతిసాగర్, చిలుక రాజు, పుట్ట ప్రణయ్‌భాస్కర్, బాలస్వామి, మాచర్ల బాబు, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్నం మూడున్నరకే కుర్చీలు ఖాళీ



ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు

నడికూడ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సమయపాలన పాటించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో ఉండాల్సిన అధికారులు శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకే ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. దీంతో ఎండలో వివిధ గ్రామాల నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి పని నిమిత్తం వచ్చిన బాధితులు అధికారులు లేకపోవడంతో వెనుదిరిగారు. కార్యాలయంలో ఎవరూ లేకున్నా ఫ్యాన్లు మాత్రం తిరుగుతూనే ఉండడంతో అక్కడికి వచ్చిన వారు ఫ్యాన్ స్విచ్ ఆఫ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని అధికారులపై చర్య తీసుకోవాలని కోరుతున్నారు. మధ్యాహ్నం సమయంలో అధికారులు అందుబాటులో ఉండడం లేదని అంటున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఎలక్షన్ విధుల్లో భాగంగా తనతోపాటు మిగతా సిబ్బంది ఫీల్డ్‌వర్క్‌కు వచ్చినట్లు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ సరోజనను సాయంత్ర 5 గంటల వరకు కార్యాలయంలో ఉండాలని ఆదేశించానని, కానీ ఆమె సమాచారం ఇవ్వకుండా ముందస్తుగా వెళ్లినట్లు తెలిపారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.37,460 విలువైన మద్యం పట్టివేత



కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడేనికి చెందిన నాలుగు ఇళ్లల్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.37,460 విలువ గల మద్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపల్లిగూడేనికి చెందిన గట్టు అనిల్, ముంజ యుగేందర్, పొరండ్ల కుమారస్వామి, పొరండ్ల రఘుపతి తమ ఇళ్లల్లో అక్రమంగా మద్యం నిల్వ చేశారన్న పక్కా సమాచారంతో వారి ఇళ్లపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో గట్టు అనిల్ ఇంట్లో రూ.9,150, ముంజ యుగేందర్ ఇంట్లో రూ.8,830, పొరండ్ల కుమారస్వామి ఇంట్లో రూ.5,490, పొరండ్ల రఘుపతి ఇంట్లో రూ.13,990 విలువ గల మద్యం లభించగా స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఐనవోలులో..



ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న పైండ్ల సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. బెల్టుషాపు నిర్వహిస్తున్నాడనే పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా రూ. 2,600 విలువగల బీరు బాటిళ్లు లభించినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కడియం శ్రీహరి రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న సురేష్

వేలేరు : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కష్టంతో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గోవింద సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కడియం శ్రీహరి ఎంతో మంది దళితులను తన రాజకీయ స్వార్థానికి ఉపయోగించుకుని వారి భవిష్యత్‌ను నాశనం చేశారని విమర్శించారు. వేలేరు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగు ప్రసాద్, సంపత్, రాజు, మహేందర్, అశోక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లో దేశ భవిష్యత్

- మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్



సోమయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దామెర : దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని, సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయుల వద్దే ఉందని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు తాడెం సోమయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. సోమయ్య ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారని కొనియాడారు. ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని, పనిచేసిన ప్రతిచోట మంచి పేరు పొందడం అభినందనీయమని అన్నారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి, హనుమకొండ, ములుగు జిల్లాల ప్రధానకార్యదర్శులు శ్రీహరి, యాకూబ్‌రెడ్డి, ఎంపీడీఓ కల్పన, ఏఎంఓ శ్రీనివాస్ రెడ్డి, సోమయ్య రమాదేవి, జుమ్మానాయక్, రాజిరెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధానకార్యదర్శి శరత్‌కుమార్, డాక్టర్ రాచర్ల గణపతి, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సోమయ్య దంపతులను ఘనంగా సన్మానించారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ

వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించగలమని డివిజనల్ అగ్నిమాపక అధికారి భద్రయ్య స్పష్టం చేశారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని సినిమా హాలులో, ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రమాద తీవ్రత, పరిస్థితిని బట్టి స్పందించాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే సత్వర చర్యలు చేపట్టడంతోపాటు సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని కోరారు. ఎంత త్వరగా సమాచారం ఇస్తే అంత ఎక్కువగా నష్టాన్ని నివారించొచ్చని తెలిపారు. సమాజంలోని ప్రతీఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణ దిశగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలన్నారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం పోస్టర్లను అంటించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చదువుకున్న యువకులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలి



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న కల్పన

శాయంపేట : ఎండ తీవ్రత అధికంగా ఉందని, ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలని ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ ఫీల్డ్ ఫెసిలిటేటర్ కల్పన అన్నారు. మండలంలోని గోవిందాపూర్‌లో శుక్రవారం ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. అత్యధిక ఉష్ణోగ్రతలు ఉండడం వలన కూలీలందరూ త్వరగా పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాని సూచించారు. ఇంటికి వెళ్లిన వెంటనే చేతులు, కాళ్లు కడుక్కోవద్దని అరగంట తర్వాత కడుక్కోవాలని అన్నారు. ఎండ తీవ్రతకు అలసిపోయినట్లయితే తక్షణమే నీరు తాగొద్దని అన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఆశా వర్కర్ రాణి, రైతులు రవీందర్, వెంకటేష్, రమేశ్, అశోక్, పాణి, భిక్షపతి పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సునీల్

శాయంపేట : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రజ్వల్ సంస్థ ఫెసిలిటర్ పోతు సునీల్ అన్నారు. మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో ప్రజ్వల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందున రైతులు, కూలీలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌ల హద్దు రాళ్ల తొలగింపు

ఆత్మకూరు : మండలంలోని కొత్తగట్టు గ్రామశివారులో అక్రమంగా వెలసిన లేఅవుట్లపై అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది హద్దు రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యదర్శులు కల్యాణి, శ్రీకాంత్, పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ తనిఖీ



చెక్‌పోస్ట్ తనిఖీ చేస్తున్న ధిలీబన్

ఆత్మకూరు : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కటాక్షపూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు ధిలీబన్ తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను పరిశీలించారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగన్ మోహన్‌రెడ్డి, సీఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

జోరుగా మద్యం సిండికేట్



నడికూడ : మండల కేంద్రంలోని వైన్‌షాపులో మద్యం సిండికేట్ జోరుగా సాగుతోంది. ఎక్సైజ్ అధికారులు సిండికేట్‌ను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి క్వాటర్‌పై రూ.20 నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారని మందుబాబులు మండిపడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే సిండికేట్ ప్రైవేట్ వ్యక్తులు బెదిరింపులు, దాడులకు పాల్పడడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడుతామని బెదిరింపులకు దిగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి



ఆత్మకూరు : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని పరకాల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ కన్వీనర్ మాదాసి శ్రీధర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. మాయమాటలు చెప్పే పార్టీల మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి గుండెబోయిన శ్యామ్, మండల యూత్ అధ్యక్షుడు తనుగుల సందీప్, నాయకులు మార్త కేదారి, వడ్డెపెల్లి వేణు, రాసమల్ల రామకృష్ణ, కుమార్, రంజిత్ పాల్గొన్నారు.